
# గోదావరి కథలు

బి.వి.ఎస్. రామారావు

ఎమెస్కో



గోదారి తల్లిని
ఆటలతో పాటలతో అర్చించిన
పాపాయీ నుంచి తాతాయీ రసజ్ఞులకు
ముళ్ళపూడి
సీతారాముడు ఇస్తున్న
తీర్థ ప్రసాదాలు
ఈ
గోదావరి కథలు

## ఇదీ వరుస...


| | | |
|---|---|---|
| | నదీ-వాడూ-కథ | 5 |
| | సీతారాముడేమన్నాడోయ్! | 7 |
| | రచయిత పరిచయం | 11 |
| 1. | గుండెల్లో గోదావరి | 15 |
| 2. | ఎసరూ - అత్తెసరూ | 40 |
| 3. | తిప్పలు | 51 |
| 4. | ఇదం బ్రాహ్మం | 66 |
| 5. | త్రిలోకసుందరి | 79 |
| 6. | అద్దరి - ఇద్దరి | 96 |
| 7. | పునాది | 110 |
| 8. | బైరాగి | 121 |
| 9. | అది - వాడు - చేప | 135 |
| 10. | రాగిడబ్బు | 152 |
| 11. | సీతమ్మకి చేయిస్తే..... | 163 |
| 12. | పుష్కరాల రేవులో పుల్లట్లు | 186 |
| 13. | ఆఫీసులో ఆవకాయ గొంతులో వెలక్కాయ | 252 |
| 14. | గోదానం | 263 |

# గుండెల్లో గోదావరి

శుభానికైనా, అశుభానికైనా అందరూ కలిసి కట్టుగా వుంటారు బంగారంపేట జనాభా.

ఆ ఉదయం శుభకార్యమే జరుగుతోంది. దానికి, వాడికి – పెళ్ళి.

ముహూర్తాని కింకా అరగంట టైము వుందనగానే తూతూ మంత్రం చెప్పి తాళి కట్టించేయాలని తొందరపడుతున్నాడు పంతులు.

గోదావరి వరద మంచి పోటులో వుంది. ఎగువనున్న పోలవరం దగ్గర ఊటకు గట్లునాని అండలండలుగా పడిపోతున్నాయన్న పుకారు తెల్లారగట్టే విన్నాడు పంతులు. అదే నిజమైతే, గండి పడడం ఖాయం. ఈ లోతట్టు గ్రామం క్షణంలో మునిగిపోయి, కొట్టుకుపోగలదన్న సంగతి పంతులుకి తెలుసు. అందుకే ఎలాగో ఈ పెళ్ళి అయిందని పించెయ్యడానికి హడావిడి పడుతున్నాడు.

దాని పెళ్ళి చూడాలన్న సరదా, పప్పు అన్నం తినాలన్న సంబరంలో ఈసంగతెవరూ పట్టించుకోవడం లేదు – ఆపేట జనాభా.

పూరిళ్ళ నడుమ పాటిదిబ్బను సాపుచేసి, అలికి ముగ్గెట్టి దానిమీద ఎత్తుగా షామియానా వేసి, దాంట్లో రెండు ఇనుపకుర్చీలు వేసి దాన్ని – వాణ్ణి కూర్చోబెట్టారు.

తెల్లచీర, చెమటకు పసుపుబారిన తెల్లని రవిక, పెద్దకళ్ళను మరింత పెద్దవి చేస్తున్న నల్లని కాటుక, బాసికం బిగువున దోబూచులాడుతున్న పెళ్ళిబొట్టు, బుగ్గసొట్టను మరింత సొట్టచేస్తున్న చుక్క, బాసికం దారాల బిగువుకు పొంగి కోలముఖాన్ని మరింత కోలగా మార్చిన వత్తయిన జుట్టు, ధృఢమైన అరచేతుల్ని మృదువుగా మార్చిన గోరింట చుక్కలు, వంపులకు సొంపులిస్తున్న చెమ్కీదండ, ఎప్పుడూ పంచకళ్యాణిలా పరుగులెత్తే ఆ చెలాకిపిల్లకు సిగ్గుముంచుకొచ్చి, తల వంచుకుని, రంగు రంగుల గాజులను మాటిమాటికి తుడుముకుంటూ బొమ్మలా కూర్చోడం అందరికీ ఆశ్చర్యంగానూ, సంబరంగానూ వుంది.

ఇంకా టైలరుకొట్టువాసన వదలని తెల్లచొక్కా, అంచులున్న తెల్లపంచె, తలపాగా వదులవ్వకుండా కాస్తున్న బాసికం, కర్పూరం హరించిన చెమ్కీ దండవేసుకుని, నల్లకళ్ళజోడులోంచి దిక్కులు చూస్తూ, అక్కడ ఆడంగులందరి కన్నా తనకు కాబోయేదే అందగత్తె అన్న ధీమాతో కాలుమీద కాలేసుకుని దిబ్బ అదిరేలా కాళ్ళూపేస్తున్నాడు దాని పక్కన కూర్చున్న ఆ కాబోయేవాడు.

పిల్లా జల్లాతో, పిన్నా పెద్దలతో దిబ్బంతా కిటకిటమంటూ కళకళలాడుతోంది.

పరగడుపునే పీకల్దాకా పట్టించి, ఢమా ఢమా వాయిస్తున్న రామఢోలు అక్కడ వాతావరణాన్ని మోతెక్కించేస్తోంది.

ఆ మోతకు లయగా బిలబిలా పిల్లలు షామియానాలో అమ్మలక్కలను దూసుకుపోతూ గొల్ల స్తంభాలాట ఆడేస్తున్నారు.

దిబ్బ దిగువున గాడిపొయ్యి మీదున్న వరుస గుండిగలు మరిగిపోతున్నాయి.

వాటి చుట్టూ వున్న కంజాయింపుగాళ్ళు వంటల్ని చకచక లాడించేస్తున్నారు.

అలా అక్కడ వాతావరణం పెళ్ళి కళతో ధగధగలాడిపోతోంది.

"అయం ముహూర్తస్సుముహూర్తోస్తూ...." అయ్యా అందరూ అక్షింతలు వెయ్యండి అన్న పంతులు కేకకి క్షణంలో ఆ జంట బాపతు తలలు పసుపు బారిపోయాయి.

"మాంగల్యం తంతునానేన మమజీవన హేతునా, కంఠేబధ్నామి శుభగే త్వం...."

చాటుగా పోయిన బాజావాళ్ళు చటుక్కున ఊడిపడి మిగతా మంత్రాల్ని మోతలో కలిపేయగా దాని మెడలో వాడు మూడు ముళ్ళూ గట్టిగా వేశాడు.

"తప్పుకోండి తప్పుకోండి అబ్బాయిగారు వస్తున్నారు" అన్న కేకలు విని అందరూ స్తబ్దులై పోయారు.

ఆకాశం నుంచి ఊడిపడ్డట్టు దిబ్బమీద వెలిసిన అబ్బాయిగారు పంతులు చేతులో ఓ నగపెట్టి, చెవిలో ఏదో గుసగుసలాడి చటుక్కున మాయమైపోయారు.

పంతులు ముఖం చాటంతైంది. "మన ఊరి షావుకారైన శ్రీశ్రీశ్రీ చిన వీరాస్వామిగారి కుమారులు శ్రీశ్రీశ్రీ అబ్బాయిగారు వధూవరులను ఆశీర్వదించి వధువుకి ఓ సువర్ణమాల" అంటూ ఓ వంటిపేట సన్నని గొలుసు అందరికీ చూపించాడు.

అందరి కళ్ళు అదోలా మెరిశాయి. గొలుసుని వాడికిచ్చి దాని మెడలో వెయ్యమన్నాడు. వాడా పనిచేస్తూ వెళ్ళిపోతున్న అబ్బాయిగారి కోసం అదోలా వెతుకుతున్న దాని కళ్ళని చూశాడు.

అంతలో మెలికలు తిరుగుతూ అమ్మలక్కలను తప్పించుకొచ్చిన ఓ పిటపిటలాడే పడుచు, పంతులు చేతిలో ఏదో పెట్టి హోయలొలికిస్తూ, మళ్ళీ మెలికలు తిరుగుతూ వెళ్ళిపోయింది.

పంతులు ముఖం మరోసారి చాటంతైంది. "రాజమండ్రి కాపురస్తులు జంగం పైడమ్మగారు వధూవరులను ఆశీర్వదించి వరుడికి ఓ సువర్ణ అంగుళీయకం" అంటూ ఓ ఉంగరాన్ని దానికిచ్చి వాడికి తొడగమన్నాడు.

అది ఆ పనిచేస్తూ వెళ్ళిపోతున్న ఆ పైడమ్మకోసం అదోలా చూస్తున్న వాడి కళ్ళను చూసింది.

గావుకేకలాంటి హారను మోతతో ఓ పోలీసు జీపు దిబ్బ దగ్గర ఆగింది. హడావిడిగా ఓ కానిస్టేబులు దిబ్బెక్కాడు. "గోదావరికి పోలవరం కాడ గండిపడింది. కాసేపట్లో ఈ ఊరు మునిగిపోతుంది. అందుకని అందరూ ఏటిగట్టు ఎక్కేయండి. ఇక్కడే వుంటే ప్రాణాలు పోతాయి" అన్న పిడుగులాంటి వార్త వినిపించాడు.

అక్కడున్న వాళ్ళ గుండెలు గుభేలు మన్నాయి.

కానిస్టేబులు దిబ్బ దిగుతూ ఆ జంటకేసి చూసి "ఓరి నువ్వట్రా? అప్పుడే బయటికి వదిలేశారా నిన్ను?" అని వాణ్ణి పలకరించి చటుక్కున జీపు ఎక్కేశాడు.

"ఇంకా సూత్తూ కూకున్నారేటి, పోలవరం కాడ గండిపడితే నిముసాల్లో మనూరు కొట్టుకుపోద్ది. కొంపలో వున్న సామాను సర్దేసి బేగి ఏటిగట్టుకెక్కేయండే హెస్" అన్నాడు ఓ పెద్దయ్య.